సాక్షి
కామారెడ్డి
గురువారం । 19 । డిసెంబర్ । 2024



గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



కాలయాపన చేయొద్దు

ప్రభుత్వం చర్చల పేరిట కాలయాపన చేయవద్దని, వెంటనే డిమాండ్లను పరిశీలించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు కోరారు.

- 9లో ▸



వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.8 /7.6

ఉదయం మంచు కురుస్తుంది. శీతల గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

చలితో జాగ్రత్త..

‘శీత’ల సమస్యలు.. వెచ్చని ఉపశమనాలు





కామారెడ్డి టౌన్: జిల్లాలో చలి తీవ్రత కొనసాగుతోంది. చాలా ప్రాంతాలలో నాలుగైదు రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీలలోపే నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు వణికిపోతున్నారు. చాలామంది జలుబు, దగ్గు, దమ్ము, చర్మ, ఊపిరితిత్తులు, కీళ్ల సమస్యలు, సీజనల్ జ్వరాలతో బాధపడుతున్నారు. చలితో పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తినే ఆహారం, జీవనశైలి మార్చుకోవాలని జనరల్ ఫిజీషియన్ వెంకట్, చిన్నపిల్లల వైద్య నిపుణుడు శ్రీనివాస్ సూచిస్తున్నారు. వారందిస్తున్న సూచనలు..

- చలికాలంలో చాలామంది నీటిని తక్కువగా తాగుతారు. ఇలా చేస్తే శరీరంలో నీటిశాతం తగ్గి జీర్ణక్రియ మందగిస్తుంది. ఒంట్లో జీవక్రియల రేటు తగ్గిపోతుంది. చలికాలంలో దాహం వేసినా వేయకున్నా తరచూ నీళ్లను తాగాలి.
- చలి గాలికి చర్మం పొడారిపోయి పగుళ్లు వచ్చి దురద పెడుతుంది. దీని నుంచి విముక్తి కోసం రాత్రిపూట చర్మానికి కొబ్బరి నూనె, ఆలివ్ నూనె లాంటివి రాసుకోవాలి. పెదవులు, ముఖం పగుళ్లు ఏర్పడకుండా లిప్ బామ్, కోల్డ్‌క్రీం, వైట్ పెట్రోలియం జెల్లీ లాంటివి రాసుకోవాలి. వెచ్చదనం కోసం ఉన్ని దుస్తులు ధరించాలి.
- ఆస్తమాతో బాధపడే వారు చాలా జాగ్రత్తగా ఉండాలి. శరీరానికి వేడి తగిలేలా చూసుకోవాలి. జలుబు, దగ్గు నుంచి ఉపశమనం కోసం రోజూ ఆవిరి పట్టుకోవాలి.
- శిశువులను ఉదయం కాసేపు ఎండలో ఉంచాలి. వెచ్చని దుస్తులు వేయాలి.
- చలి కాలంలో సాధారణంగా వచ్చే దగ్గు, గొంతు నొప్పిలాంటి సమస్యల నుంచి ఉపశమనం కోసం పాలలో మిరియాల పొడిని కలిపి తాగాలి.
- కీళ్లు బిగుసుపోయి కదలికలు కష్టంగా మారతాయి. దీని నివారణ కోసం కీళ్లను తరచూ కదిలించాలి. ఏదో ఒక వ్యాయామం, అటూఇటూ తిరగడం చేయాలి.
- ఆహారాన్ని వేడిగా, తాజాగా తీసుకోవాలి.




వెంకట్, జనరల్ ఫిజీషియన్, జీజీహెచ్



శ్రీనివాస్, చిన్నపిల్లల వైద్యుడు

నారును కాపాడుకుందామిలా



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : చలి తీవ్రతకు మనుషులు, పశుపక్ష్యాదులే కాదు.. నారుమడీ వణుకుతోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో నారుమడులతో ఎదుగుదల లోపిస్తోంది. జిల్లాలో ఈ ఏడాది యాసంగిలో 2.50 లక్షల ఎకరాల్లో వరిపంట సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 4,745 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. 80 వేల ఎకరాల కోసం నారుమడులు పోసి ఉన్నారు. ఇంకా నారుమడులు పోస్తున్నారు. ప్రస్తుతం తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతుండడం, భారీగా మంచు కురుస్తున్న నేపథ్యంలో నారుమడుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా వ్యవసాయ అధికారి ‘సాక్షి’కి వివరించారు. ఆ వివరాలు..

- రాత్రి నారుమడిలో నిండా నీటిని ఉంచి ఉదయం నీటిని బయటకు పంపించాలి.
- నారుమడికి వేడిని అందించేందుకు గొర్రెలు, కోళ్ల ఎరువును చల్లితే ఫలితం ఉంటుంది. అలాగే భాస్వరాన్ని కూడా చల్లాలి.
- వీలైతే నారుమడికి చుట్టూరా కర్రలు గానీ, సలాకలు గానీ ఏర్పాటు చేసి పైన కవర్లతో క... ప్పా... లి. ఇలా చేస్తే నారుమడిపై చలి ప్రభావం తగ్గుతుంది.
- నారుమడుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేసినా ఎదుగుదలపై ప్రభావం చూపుతుందన్న విషయాన్ని గమనించాలి. అలాగే నారుమడి పోసిన 22 రోజుల నుంచి 25 రోజులలోపు నాట్లు వేయాలి.



తిరుమల ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

సర్కారు దవాఖానాకు సుస్తీ

- జీజీహెచ్‌లో సగం వైద్య పోస్టులు ఖాళీ
- సరైన సేవలందక ఇబ్బందిపడుతున్న రోగులు
- ఇరుకైన భవనంతోనూ ఇక్కట్లు



ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఇంటినుంచి తెచ్చుకున్న బెడ్‌షీట్లు, రగ్గులు వినియోగిస్తున్న రోగులు



మార్చురి విభాగం పక్కన ఆరుబయట బ్లడ్ శాంపిల్స్ సేకరిస్తున్న సిబ్బంది

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఉన్న 330 పడకల సర్కారు దవాఖానా(జీజీహెచ్)కు సమస్యలతో సుస్తీ చేసింది. సగానికిపైగా వైద్య పోస్టులు ఖాళీగా ఉండడంతో మెరుగైన సేవలు అందడం లేదు. ఆస్పత్రి భవనం సైతం ఇరుకుగా ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కామారెడ్డి వైద్య కళాశాలతో పాటు జీజీహెచ్‌లో 28 ప్రొఫెసర్, 30 అసోసియేట్ ప్రొఫెసర్, 59 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులున్నాయి. కానీ ప్రస్తుతం 13 మంది ప్రొఫెసర్లు, 16 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 10 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఇటీవల 17 మందిని కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించారు. మిగతా పోస్టుల భర్తీకి రెండుసార్లు నోటిఫికేషన్ ఇచ్చినా.. ఇక్కడ పనిచేయడానికి ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ప్రధానంగా గైనిక్, జనరల్ మెడిసిన్, జనరల్ ఫిజీషియన్‌ల కొరత ఉంది. రాత్రి సమయంలో సీనియర్ వైద్యులు విధుల్లో ఉండడం లేదు. దీంతో ఆ సమయంలో ఆస్పత్రులకు వస్తున్న గర్భిణులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యులు అందుబాటులో లేని సందర్భాలలో డెలివరీలకోసం వచ్చే గర్భిణులను, క్షతగాత్రులను, ఇతర అత్యవసర కేసులను నిజామాబాద్‌కుగానీ, రాష్ట్ర రాజధానికి గాని రిఫర్ చేస్తున్నారు.

ఆస్పత్రిలో అన్నీ సమస్యలే..

జిల్లా ఆస్పత్రిలో సమస్యలు తిష్ట వేశాయి. ప్రధానంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఆస్పత్రికి వచ్చే వారు ఇంటినుంచి గానీ, దుకాణాలలో కొనుక్కునిగాని నీటిని తాగుతున్నారు. బాత్‌రూంలు, మరుగుదొడ్లలోనూ నీటి సమస్య ఉంది. ఆస్పత్రి భవనం పెచ్చులూడుతుండడంతో రోగులు భయపడుతున్నారు. ఆస్పత్రి ఆవరణలో వాహనాల పార్కింగ్‌కు సరిపడా స్థలం లేదు. దీంతో పార్కింగ్ కోసం వాహనదారుల మధ్య గొడవలూ జరుగుతున్నాయి. ఆస్పత్రి భవనంలో 43 విభాగాలున్నాయి. గదుల కొరతతో కొన్ని విభాగాలను వరండాలో నిర్వహిస్తున్నారు. ప్రధానంగా మార్చురి సమీపంలోనున్న స్థలంలో రోగుల రక్త నమూనాలు సేకరిస్తున్నారు. టీబీ ల్యాబ్ పక్కన గర్భిణులకు రక్త పరీక్షలు చేస్తున్నారు. మంచాలపైన చికిత్స పొందుతున్న రోగులకు బెడ్‌షీట్‌లు కూడా వేయడం లేరు. అధునాతన పరికరాలను వినియోగించకపోవడంతో మూలన పడ్డాయి. నెలలు గడుస్తున్నా మందుల కొరత సమస్య తీరడం లేదు. ఒకే గదిలో ఆయూష్‌కు సంబంధించిన మూడు ఆస్పత్రులు కొనసాగుతుండడం గమనార్హం. చికిత్స పొందుతున్న రోగులు, వారి వెంట ఉండే సహాయకులు భోజనాలు చేయడానికి ప్రత్యేక గదులు లేకపోవడంతో ఎక్కడ స్థలం కనిపిస్తే అక్కడ కూర్చొని భోజనాలు చేస్తున్నారు.



ప్రసూతి విభాగం దోరు పక్కన ప్రమాదకరంగా ఉన్న ఆక్సిజన్ సిలిండర్‌లు

కొన్ని విభాగాలను తరలిస్తేనే..

ఇరుకు భవనంలో ఉన్న కొన్ని విభాగాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తే గదుల కొరత తీరే అవకాశాలున్నాయి. ప్రధానంగా డయాలసిస్, క్యాన్సర్ వార్డు, ఐసోలేషన్, మార్చురి, ఆయూష్, ఐసీటీసీ, ఏఆర్‌టీ లాంటి విభాగాలను దేవునిపల్లి వద్ద ఉన్న వైద్య కళాశాలకు తరలిస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మాతా శిశు ఆస్పత్రిని ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తే గర్భిణులు, బాలింతలు, శిశువులకు మెరుగైన సేవలు అందుతాయి.



ఆస్పత్రి ఆవరణలో వృథాగా ఉన్న వాటర్ క్యాన్



వినియోగంలో లేక దుమ్ముపట్టిపోతున్న ఇంక్యుబేటర్లు



ఇరుకుగా ఉన్న ఆస్పత్రి ఆవరణలోనే వాహనాల పార్కింగ్

మెరుగైన సేవలు అందిస్తున్నాం

ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. వైద్య పోస్టుల ఖాళీల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఆస్పత్రి కొంచం ఇరుకుగా ఉండడంతో కాస్త ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమే. కళాశాల నూతన భవనం నిర్మాణం పూర్తయితే సమస్యలు తీరుతాయి.

– ఫరీదా, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, జీజీహెచ్, కామారెడ్డి

‘త్వరితగతిన రుణాలు అందించాలి’



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలను త్వరితగతిన పంపిణీ చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో రుణ లక్ష్యాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రూ. 250 కోట్ల రుణాలు పంపిణీ చేయాలన్నది లక్ష్యమన్నారు. అర్హత కలిగిన మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా వచ్చేనెలాఖరులోగా రుణాలను పంపిణీ చేయాలన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బందితో సమీక్షించి రుణాల పంపిణీతో పాటు రికవరీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, డీపీఎం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయాలి



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

రామారెడ్డి : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. బుధవారం ఆయన పోసానిపేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల సర్వేకు సంబంధించిన యాప్‌లో దరఖాస్తుదారుల పూర్తి సమాచారాన్ని పొందుపరచాలన్నారు. రోజూ 20 నుంచి 30 ఇళ్లను సర్వే చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సువర్ణ, ఎంపీడీఓ తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

వచ్చేనెల ఒకటిన పోచారం నీటివిడుదల

- ఐదు విడతలుగా ఆయకట్టుకు నీరు
- త్రైబంది సమావేశంలో నిర్ణయం



మాట్లాడుతున్న ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు నుంచి వచ్చేనెల ఒకటో తేదీన ఆయకట్టుకు నీటి విడుదలను ప్రారంభించనున్నట్లు ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. యాసంగి పంటలసాగు కోసం నీటి విడుదలపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయకట్టు రైతులతో త్రైబంది సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పోచారం ప్రాజెక్టులో 1.65 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. నిబంధనల ప్రకారం ఈ ఏడాది యాసంగి సీజన్‌లో ప్రాజెక్టు నీటిని ‘ఏ’ జోన్‌కు కేటాయించాల్సి ఉందన్నారు. ఐదు విడతలలో నీటిని అందించాలని నిర్ణయించామన్నారు. ఒక్కో విడతలో 15 రోజులపాటు నీటిని విడుదల చేస్తామని, రెండు విడతల మధ్య పది రోజుల పాటు నీటి విడుదల నిలిపివేస్తామని తెలిపారు. నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని సూచించారు. సమావేశంలో ఇరిగేషన్ ఏఈ అక్షయ్, మాజీ ఎంపీపీ రాజ్‌దాస్, మాల్తుమ్మెద సొసైటీ మాజీ చైర్మన్ రాంచందర్‌రెడ్డి, నాగిరెడ్డిపేట మాజీ సర్పంచ్ విఠల్‌రెడ్డి, నాయకులు కిష్టయ్య, ఇమామ్, శేఖర్, ఫారూక్, గులాం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ‘మధ్యాహ్నం’ బంద్!

- వంట చేయడానికి ముందుకు రాని ఏజెన్సీ నిర్వాహకులు
- ఇంటినుంచి బాక్సులు తెచ్చుకుంటున్న విద్యార్థులు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

నిజాంసాగర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ‘మధ్యాహ్నం’ బంద్ అయ్యింది. 18 రోజులుగా వంట చేయడం లేదు. పాఠశాలలో వంట చేయడానికి ఏజెన్సీ నిర్వాహకులు ముందుకు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ పాఠశాలలో 230 మంది విద్యార్థులున్నారు. మండల కేంద్రంతోపాటు సుల్తాన్‌నగర్, గోర్గల్, మాగి గ్రామాల నుంచి ఉన్నత పాఠశాలకు వస్తుంటారు. ఈనెల ఒకటో తేదీనుంచి ఏజెన్సీ నిర్వాహకులు వంట చేయడం లేదు. దీంతో విద్యార్థులకు పాఠశాలలో మధ్యాహ్న భోజనం అందడం లేదు. ఈ నేపథ్యంలో కొందరు విద్యార్థులు ఇంటినుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకుంటుండగా.. మరికొందరు పస్తులుంటున్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బిల్లులు నెలల తరబడి రాకపోవడంతో వంట చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది. అప్పులు చేసి వంట చేయలేమని నిర్వాహకులు చెబుతున్నారు.

ఎవరూ ముందుకు రావడం లేదు

పాఠశాలలో వంట చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా వంట చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి చెప్పినా వంట చేసేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు.

– రాంచందర్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు



ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకొని భోజనాలు చేస్తున్న విద్యార్థులు

న్యూస్‌రీల్

జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శన



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని భవిత పాఠశాలలో బుధవారం నేషనల్ గ్రీన్ కోర్(ఎన్జీసీ) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వ్యర్థ పదార్థాలనుంచి తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. డీఈవో రాజు ప్రదర్శనలను వీక్షించి విద్యార్థులను అభినందించారు. ఈ ప్రదర్శనలో లింగంపేట ఎస్సీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ, అచ్చంపేట మోడల్ స్కూల్ ద్వితీయ, లింగుపల్లి యూపీఎస్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సిద్దిరాంరెడ్డి, ఎన్జీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ విద్యాసాగర్, ఉపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, కృష్ణాకర్, సురేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అర్చరీ పోటీలకు ఎంపిక



దోమకొండ : మండల కేంద్రంలోని గడికోటలో బుధవారం జిల్లా స్థాయి అర్చరీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ చూపినవారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. రికర్వ్ బాలికల విభాగంలో కదిరె సిందూజ, బాలుర విభాగంలో అనుదీప్, ఇండియన్ రౌండ్ బాలికల విభాగంలో ప్రీతి, బాలుర విభాగంలో రాహుల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కోచ్ ప్రతాప్‌దాస్ తెలిపారు. రాష్ట్రస్థాయి ఎంపికైన క్రీడాకారులకు దోమకొండ ఎస్సై ఆంజనేయులు బహుమతులు అందించారు. క్రీడాకారులను అర్చరీ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అనిల్ కామినేని, జిల్లా అధ్యక్షుడు తిరుమల్ గౌడ్, సెక్రెటరీ మోహన్‌రెడ్డి, ట్రెజరర్ గంగాధర్ అభినందించారని కోచ్ తెలిపారు.

సెపక్‌తక్రా జిల్లా జట్టు..



కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో బుధవారం సెపక్‌తక్రా జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ చూపినవారిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. వీరు ఈనెల 27, 28, 29 తేదీల్లో హన్మకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి సీఎం కప్ సెపక్‌తక్రా పోటీలలో పాల్గొంటారని సెపక్ తక్రా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేష్, నరేష్ తెలిపారు.

బాలికల జట్టు: జి.పూజిత, బి.శ్రావ్య, ఏడీ.హల్యా, కె.పూజిత, భవ్యశ్రీ

బాలుర జట్టు: వి.హరీష్, జి.శివకుమార్, బి.దీపక్, ఈ.నితీష్‌గౌడ్, ఎస్.భరత్.

కానిస్టేబుల్ సస్పెన్షన్!

సాక్షి ఎఫెక్ట్..

ఖలీల్‌వాడి/రెంజల్: రెంజల్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసులో కస్టడీలో ఉన్న నిందితుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఇన్‌చార్జి సీపీ సింధు శర్మ చర్యలకు ఉపక్రమించారు. డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ ప్రసాద్‌ను గురువారం సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఈనెల 12న రెంజల్ పోలీస్‌స్టేషన్‌లో నిందితుడు రత్నావత్ రెడ్యా ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనపై ‘సాక్షి’లో ఈ ఘటనపై ప్రచురితమైన కథనంపై స్పందించిన ఇన్‌చార్జి సీపీ సింధుజీ శర్మ.. సీఐ, ఎస్సై, పోలీసు సిబ్బందిని మందలించినట్లు తెలిసింది. అదేవిధంగా ఈ ఘటనకు సంబంధించి మానవ హక్కుల సంఘం నివేదిక కోరగా జిల్లా అధికారులు పంపించినట్లు సమాచారం. ప్రస్తుతం న్యాయమూర్తితో జుడీషియల్ విచారణతో పాటు, మెదక్ జిల్లా తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి డిపార్ట్‌మెంట్ విచారణ జరుపుతున్నారు. కాగా రత్నావత్ రెడ్యా ఆత్మహత్యకు సంబంధించిన పోస్టుమార్టం, ఫోరెన్సిక్ రిపోర్ట్ వచ్చిన తర్వాత బాధ్యులైన మిగతా పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

ఏడుగురి రిమాండ్..

రెంజల్ మండలంలోని ఓ గ్రామంలో మతిస్థిమితం లేని బాలికపై లైంగిక దాడి జరిపాడని నిందితుడు రత్నావత్ రెడ్యాపై దాడి చేసిన 13 మందిపై పోలీసులు నమోదు చేశారు. ఇందులో ఏడుగురిని గురువారం రిమాండ్‌కు తరలించారు.

క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగంగా పూర్తిచేయాలి

● అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



భిక్కనూరు: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం బస్వాపూర్‌లో సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని, ఇళ్లు లేని నిరుపేదల వివరాలను పక్కాగా సేకరించాలని, వారికి స్థలం ఉంటే దానికి సంబంధించిన ధ్రువపత్రాలను స్థలం వద్దనే వారి ఫొటోను అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే వారి జీవన స్థితిగతుల గురించి సర్వేలో నివేదించాలన్నారు. ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి దయాకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి గణిత ప్రతిభా పరీక్ష పోస్టర్ల ఆవిష్కరణ



కామారెడ్డి టౌన్: రాష్ట్ర స్థాయి గణిత ప్రతిభా పరీక్ష పోస్టర్లను బుధవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రవేశ పరీక్షలకు ప్రోత్సహించడానికి ప్రతిభా పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఇలాంటి పరీక్షలు రాయడం వల్ల పోటీ పరీక్షల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. రాష్ట్ర గణిత ఫోరం అసోసియేట్ అధ్యక్షుడు తాడ్వాయి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి రామారావు, ఆర్థిక కార్యదర్శి నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీఎఫ్‌డీసీ చైర్మన్‌తో కాసుల బాల్‌రాజ్ భేటీ



బాన్సువాడ: తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎఫ్‌డీసీ) చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన దిల్‌రాజ్‌ను బుధవారం హైదరాబాద్‌లో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. దిల్‌రాజ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాసుల బాల్‌రాజ్ మాట్లాడుతూ..ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన దిల్‌రాజ్‌కు సినిమాటోగ్రఫీ చైర్మన్ పదవి రావడం సంతోషంగా ఉందన్నారు. నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి ఉన్నారు.

'చలో రాజ్‌భవన్'లో పాల్గొన్న జిల్లా నేతలు



ఎల్లారెడ్డి: గౌతమ్ అదానీ ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ కాంగ్రెస్ చేపట్టిన చలో రాజ్‌భవన్ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజ్ పాల్గొన్నారు. ప్లకార్డులతో వారు నిరసన తెలిపారు. మాజీ జెడ్పీటీసీ మోహన్ రెడ్డి తదితరులున్నారు.

చలికాలం..

▶ లైట్లు వేసుకుని వాహనాలు నడపాలి



ఖలీల్‌వాడి: పొగ మంచు కారణంగా ముందు వచ్చే వాహనాలు కనబడవు. లైట్లు వేసుకుని వాహనాలపై వెళ్లాలి. ఉదయం, రాత్రివేళలో కార్లు, ద్విచక్ర వాహనాల లైట్లు వేసుకోవడం మరువొద్దు. పొగమంచు కురుస్తున్న నేపథ్యంలో ప్రయాణ సమయంలో వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా రవాణాధికారి ఉమామహేశ్వరరావు 'సాక్షి' ద్వారా వివరించారు.

■ చలి తీవ్రత పెరిగిన నేపథ్యంలో పాత వాహనాల ఇంజిన్లను హీట్ చేయాలి.

■ కార్లలో ప్రయాణించేవారు వైఫర్‌లను ఆన్‌లో ఉంచాలి.

■ పొగమంచు కురుస్తున్న నేపథ్యంలో స్పీడ్ బ్రేకర్లను గమనిస్తూ వాహనాలు నడపాలి.

■ చలికి వాహనాల టైర్లు గట్టి పడి స్కిడ్ అయ్యే అవకాశాలు ఉంటాయి.

■ ద్విచక్ర వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.

■ కారులలో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలి.

■ పొగమంచు ఎక్కువగా కురుస్తున్న సమయాల్లో ప్రయాణం వాయిదా వేసుకోవాలి.

■ చలి తీవ్రత నేపథ్యంలో వాహనాలను బ్యాటరీల పనితీరును పరిశీలించాలి. బ్యాటరీ టెర్మినల్స్‌ను తనిఖీ చేయాలి. తుప్పు పట్టి కనిపిస్తే బేకింగ్ సోడా, నీటితో శుభ్రం చేయండి. ఇది కారు బ్యాటరీ శక్తిని పెంచుతుంది. అప్పుడు కారు సులభంగా స్టార్ట్ అవుతుంది.

■ మంచు రోడ్లపై జారుతున్న కార్ల వీడియోలు వైరల్ అవుతున్నాయి. మంచు ప్రాంతాలకు కార్లపై వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలి.

■ చలికాలంలో కార్లు, బైకులు బయటకు తీయకుంటే ఇంజిన్ ఆయిల్ గడ్డ కట్టే ప్రమాదం ఉంటుంది. అప్పుడప్పుడు బైక్ లను స్టార్ట్ చేయాల్సి ఉంటుంది. దీంతో ఇంజిన్ సక్రమంగా పనిచేయడానికి వీలు ఏర్పడుతుంది.



- ఉమామహేశ్వర్‌రావు, జిల్లా రవాణాశాఖాధికారి, నిజామాబాద్

▶ పశువుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లాలో వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోయి చలి తీవ్రత పెరిగింది. దీంతో జనం వణుకుతున్నారు. అలాగే నోరులేని మూగజీవాలు సైతం చలితో ఇబ్బంది పడుతున్నాయి. కొందరు మూగ జీవాలను దొడ్లో కట్టేసి వాటిని చలి నుంచి రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కోళ్ల ఫాంలలో చలితో కోళ్లు చనిపోకుండా చుట్టూరా రక్షణ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అలాగే విద్యుత్తు దీపాలు పెట్టించి వేడి ఉండేలా చూస్తున్నారు. చలికి పశువులూ ఇబ్బంది పడతాయని జిల్లా పశువైద్యాధికారి రవికిరణ్ తెలిపారు. పశువుల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఆ వివరాలు.. సాధారణంగా చలికాలంలో పాల దిగుబడి ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగా గేదెలు కాల్షియం కోల్పోతాయి. ఇదే సమయంలో ఎదకు వస్తాయి కాబట్టి సరిపడా కాల్షియం అందించడంతో పాటు గేదెలు కట్టేలా రైతులు చూసుకోవాలి. పశువులకు పోషకాహారం ఇవ్వాలి. కాల్షియం ట్యాబ్లెట్లు తినిపించాలి. పచ్చిగడ్డితో పాటు చెరుకు వాడెను పశువులకు మేతగా వాడాలి. గడ్డిలో ప్రొటీన్లు, మినరల్స్ ఎక్కువగా ఉంటాయి. స్వీట్ పొటాటో తినిపించాలి. పశువులను ఆరుబటయ కాకుండా పాకల్లోనే కట్టేయాలి. చలిగాలులు తగలకుండా చుట్టూరా పరదాలను చుట్టేయాలి. దూడలకు న్యుమోనియా సమస్య తెలెత్తకుండా వ్యాక్సిన్లు ఇప్పించాలి. పౌల్ట్రీ రైతులు కూడా ఫాంలకు చుట్టూరా జోరబొంతలు గానీ, మరే పరదాలనైనా కట్టేసి జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాక్సిన్ ఇప్పించాలి. కుక్కలకు చలికాలంలో వైరస్‌లు వస్తాయి. లంగ్స్‌కు ఇన్‌ఫెక్షన్లు సోకుతాయి. వాటికి కూడా వ్యాక్సిన్ వేయించాలి.



- రవికిరణ్, జిల్లా పశువైద్యాధికారి, కామారెడ్డి

'గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తా'

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామీణ ప్రాంతాల్లోని శాఖా గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శాఖాగ్రంథాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. దీంతోపాటు గ్రంథాలయంలో నమోదైన సభ్యత్వాల గురించి గ్రంథ పాలకుడు జాకీర్‌హుస్సేన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక నాయకులతో ఆయన సమావేశమయ్యారు. నాగిరెడ్డిపేటలో గ్రంథాలయానికి సొంత భవనాన్ని నిర్మించేందుకు స్థానిక నాయకులు విరాళాలిచ్చి సహకరించాలన్నారు.

రూ.2 కోట్ల 45 లక్షల బకాయిలు..

జిల్లాలోని గ్రామ పంచాయతీల నుంచి రూ. 2 కోట్ల 45 లక్షల గ్రంథాలయ పన్ను రావాల్సి ఉందని చంద్రకాంత్‌రెడ్డి తెలిపారు. నాగిరెడ్డిపేట గ్రంథాలయంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 19 శాఖా గ్రంథాలయాలుండగా వాటిలో నాగిరెడ్డిపేట, బాన్సువాడ, బీర్కూర్, గాంధారి, మాచారెడ్డి మండలాల్లో సొంత భవనాలు లేవన్నారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి గ్రంథాలయాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. మొదటిసారిగా మండలానికి వచ్చిన ఆయనను మండల నాయకులు సత్కరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ సిబ్బంది మౌనిక, మాజీ ఎంపీపీ రాజ్‌దాస్, మాల్తుమ్మెద సొసైటీ మాజీ చైర్మన్ రాంచందర్‌రెడ్డి, నాగిరెడ్డిపేట మాజీ సర్పంచ్ విఠల్ రెడ్డి, తదితరులున్నారు.



మాట్లాడుతున్న చంద్రకాంత్‌రెడ్డి

ఆధ్యాత్మికం

అయ్యప్ప పడిపూజ మహోత్సవం



ఎల్లారెడ్డిరూరల్: స్వామియే శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప నామస్మరణతో ఎల్లారెడ్డి పట్టణం మార్మోగింది. బుధవారం రాత్రి ఎల్లారెడ్డి పట్టణంలోని అయ్యప్ప ఆలయం ప్రాంగణంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో మండల పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి సతీమణి మంజులారెడ్డి, మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, గురుస్వాములు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

వాసవీమాతకు కుంకుమ పూజలు

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డి గ్రామంలో వాసవీ మాతకు కుంకుమ పూజల కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో వాసవీమాత చిత్రపటంతో గ్రామంలో భాజాభజంత్రీలతో ఊరేగింపును కొనసాగించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అల్లాడి సుదర్శన్, ప్రతినిధులు పాల్గొన్నారు.

సరస్వతీ మహాక్షేత్ర అష్టమ వార్షికోత్సవం

కామారెడ్డి రూరల్: ఇల్చిపూర్ శివారులో కొలువుదీరిన సరస్వతీ మాత అష్టమ వార్షికోత్సవ వేడుకలు ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్ పటేల్ ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఏఐ1 యాప్ ద్వారా 250 రకాల సేవలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఏఐ1 కెనరా బ్యాంక్ యాప్ ద్వారా 250 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని బ్యాంక్ డీఎంవో యోగేశ్వర్ తెలియజేశారు. బుధవారం మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్‌ను డీఎంవో పునఃప్రారంభించారు. అనంతరం ఖాతాదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కెనరా బ్యాంక్ ఒక ప్రభుత్వ సంస్థ అని, బ్యాంక్ ద్వారా ఇంటి లోను, రైతులకు పంట రుణాలు, కార్‌లోన్, చదువులకు, వ్యాపారులకు అనేక సేవలు అందిస్తుందని తెలిపారు. బ్యాంక్ లాభం కోసం పనిచేయదని ఖాతాదారుల ప్రయోజనాల కోసం సేవ అందించడానికి పనిచేస్తుందని తెలిపారు. బ్యాంక్ మేనేజర్ గోపాల్, ఫీల్డ్ అసిస్టెంట్ నీరోజ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని రామ్ మందిర్ ఆలయంలో మంగళవారం విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ సభ్యుల ఆధ్వర్యంలో 25వ వారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రఖండ ప్రముఖ్ పాల్గొని హనుమంతుడి గురించి వివరించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అభిలాష్‌గౌడ్



నిజాంసాగర్(జుక్కల్): రాష్ట్ర స్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీలకు మహమ్మద్‌నగర్ మండలం నర్వ గ్రామానికి చెందిన అభిలాష్‌గౌడ్ ఎంపికయ్యారు. జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అభిలాష్‌గౌడ్‌ను రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక చేశారు.

ప్రతిభ కనబర్చిన మైనార్టీ పాఠశాల విద్యార్థులు



ఎల్లారెడ్డిరూరల్: సీఎం కప్ జిల్లా స్థాయిలో జరిగిన పోటీలలో ఎల్లారెడ్డి మైనార్టీ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం తెలిపారు. బ్యాడ్మింటన్‌లో జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతిని శ్రీశాంత్, అఫ్రోజ్, రన్నింగ్‌లో శివ, గణపతి, వసీంలు జిల్లా స్థాయిలో తృతీయ బహుమతులు సాధించినట్లు వారు తెలిపారు.

సీనియర్ కబడ్డీలో విజేతగా నిలిచిన పిట్లం జట్టు



కామారెడ్డి అర్బన్ : సీఎం కప్ సీనియర్ పురుషుల కబడ్డీ పోటీలు స్థానిక సరస్వతి విద్యామందిర్ హైస్కూల్‌లో జరిగాయి. పోటీల్లో 28 జట్లు పాల్గొనగా పిట్లం మండల జట్టు విజేతగా నిలిచింది. తాడ్వాయి జట్టు ద్వితీయ, రామారెడ్డి జట్టు తృతీయ స్థానాలు పొందాయి. ఈ పోటీల్లో అత్యంత ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామని కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రంగా వెంకటేశ్వరగౌడ్ తెలిపారు. జిల్లా యువజన క్రీడల అధికారి జగన్నాథం, కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రాస్ కంట్రీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కామారెడ్డి అర్బన్: అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం 10వ జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ అండర్-16, 18, 20 బాలుర, బాలికలు, మహిళలు, పురుషుల ఎంపికలు నిర్వహించారు. అత్యంత ప్రతిభ చూపిన క్రీడాకారులకు బంగారు, వెండి, కాంస్య పతకాలు, సర్టిఫికెట్లను అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్‌లు అందజేశారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22న నాగర్‌కర్నూల్ జిల్లా వనపర్తిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఎంపికైన క్రీడాకారులు..

ఎం.నితిన్, ఎస్.రాజశేఖర్, బి.భరత్‌రాజ్, జె.దత్తాత్రి, జి.సునీల్‌కుమార్, డి.అనిల్, కె.రక్షిత, బి.పవన్ దత్తారెడ్డి, జి.చందర్, జి.వసంత్‌నాయక్, ఎం.ఈశ్వర్, పి.ప్రతాప్, కె.వంశీ, ఎస్.సౌమ్య, ఎం.ప్రియాంక, డబ్ల్యూ. త్రిశరణ్, ఎస్.అభిలాష్‌గౌడ్, ఎం.జ్యోత్స్న, ఎం.అర్చన బాబు.

క్రైం కార్నర్

వేర్వేరు కేసుల్లో ఇద్దరికి జైలు శిక్ష

చెరువు నీటిని వదిలిన వ్యక్తికి మూడేళ్లు..

రుద్రూర్: కోటగిరి దామర చెరువు నీటిని అనుమతి లేకుండా విడుదల చేసిన ఎండీ కలీం అనే వ్యక్తికి న్యాయస్థానం మూడేళ్ల జైలుశిక్ష, రూ.4వేల జరిమానా విధించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. 2016 నవంబర్ 8వ తేదీన కలీం అనుమతి లేకుండా చెరువు నీటిని విడుదల చేసి రైతులకు నష్టం కలిగించడంతోపాటు కాపలా ఉన్న రెవెన్యూ సిబ్బందిని బెదిరించాడని తెలిపారు. బాధితుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్ రాణి వాదనలు వినిపించారని, నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.4వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఈ శివసాయి తీర్పునిచ్చారని ఎస్సై తెలిపారు.

చీటింగ్ కేసులో 18 నెలలు..

బోధన్ టౌన్(బోధన్): చీటింగ్ కేసులో ఓ వ్యక్తికి 18 నెలల జైలు శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం పూజిత బుధవారం తీర్పునిచ్చారు. పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామానికి చెందిన బయ్యన్‌వార్ హన్మంత్‌పై ఎస్ ప్రభాకర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయగా, 2015లో పట్టణ పోలీస్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. సాక్ష్యాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి 18 నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బెజుగం చెర్వుతండా గ్రామ మాజీ సర్పంచ్ మలావత్ మంగ్లీ(56) బుధవారం మృతి చెందింది. సుమారు ఏడు నెలల క్రితం ఆమె ఆర్టీసీ బస్సులో నుంచి కిందపడి తీవ్రంగా గాయపడింది. ప్రమాదంలో ఆమె తలకు బలమైన గాయం కావడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించారు. అప్పటి నుండి మంగ్లీ మంచానికే పరిమితమై బుధవారం మృతి చెందింది. ఇదిలా ఉండగా మంగ్లీ భర్త హరిలాల్ తన భార్య తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమైందనే బెంగతో ఆరు నెలల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. ఆరు నెలల వ్యవధిలో భార్యాభర్తలు మరణించడంతో గ్రామంలో విషాదం నెలకొంది.



మలావత్ మంగ్లీ(ఫైల్)

పరిస్థితి విషమించి ఒకరు మృతి

బీబీపేట: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిన ఘటనలో గాయాపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బీబీపేటకు చెందిన నీల రాజయ్య (52) మంగళవారం రోజున నస్కల్ గ్రామం నుంచి బీబీపేటకు వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఆవు..

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండాలో విస్లావత్ దశరథ్‌కు చెందిన ఆవు బుధవారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. గ్రామ శివారులోని వ్యవసాయ భూమిలో మేతకు వెళ్లిన ఆవు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతి చెందింది. సుమారు రూ.45వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు దశరథ్ కోరాడు.

చోరీ కేసులో అరెస్టు

ఎల్లారెడ్డి: పట్టణంలో చోరీలకు పాల్పడిన నాగరాజును అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై మహేశ్ బుధవారం తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణంలోని ఫరూక్‌కు చెందిన ఎలక్ట్రిక్ గోదాంలో రూ.50 వేల విలువ చేసే వస్తువులను చోరీ చేయడంతోపాటు ఇటీవల బిర్యాని పాయింట్, ఇతర దుకాణాల్లో తాను చోరీకి పాల్పడినట్లు నాగరాజు అంగీకరించాడని ఎస్సై తెలిపారు. నాగరాజును కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు.

పాముకాటుతో రైతు మృతి

- ఐదు రోజుల తరువాత వెలుగుచూసిన ఘటన
- కంది తోటలో మృతదేహం లభ్యం
- డోంగ్లీ మండలం మొగాలో విషాదం



మాల్గే బస్వంత్ రావ్(ఫైల్)

మద్నూర్(జుక్కల్): చెరుకు తోటకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు పాముకాటుతో మృతి చెందిన ఘటన డోంగ్లీ మండలం మొగాలో చోటు చేసుకుంది. ఐదు రోజుల తరువాత ఈ ఘటన వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మొగా గ్రామానికి చెందిన బస్వంత్‌రావు(65)కు భార్య హన్మబాయి, నలుగురు ఆడ పిల్లలు ఉన్నారు. నలుగురు ఆడ పిల్లల వివాహం చేయగా, ఇంట్లో భార్యాభర్తలు ఉంటున్నారు. బస్వంత్‌రావు తనకు ఉన్న రెండు ఎకరాల్లో చెరుకు సాగు చేస్తున్నాడు. ఈనెల 14వ తేదీన ఉదయం బస్వంత్‌రావు తన భార్యతో కలిసి బిచ్కుందలోని బంధువుల ఇంటికి వెళ్లారు. హన్మబాయిని బంధువుల ఇంటి వద్దే ఉంచి మొగాకు వచ్చేసిన బస్వంత్‌రావు శనివారం సాయంత్రం చెరుకు తోటకు నీరు పెట్టేందుకు వెళ్లగా పాము కాలికి కాటేసింది. కాలి నుంచి శరీరానికి విషం పాకకుండా బస్వంత్‌రావు తెల్లని గుడ్డను కాలికి కట్టుకుని తిరిగి వస్తుండగా మార్గమధ్యంలోని కంది చేనులో పడిపోయి అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కందిపంట బాగా ఎత్తుగా పెరడగంతో అందులో పడిపోయిన బస్వంత్‌రావు ఎవరికీ కనపడలేదు. శనివారం నుంచి బస్వంత్‌రావుకు ఆయన భార్య ఫోన్ చేస్తూనే ఉంది. మంగళవారం బస్వంత్‌రావు తమ్ముడి కొడుకు రాజు తీవ్రంగా గాలించడం ప్రారంభించాడు. బుధవారం ఉదయం తోటకు వెళ్లి చూడగా బస్వంత్‌రావు మృతదేహం కనిపించడంతో గ్రామస్తులకు సమాచారం అందించాడు. శనివారం నుంచి బుధవారం వరకు బస్వంత్‌రావు మృతదేహం ఘటనాస్థలంలోనే ఉందని ఆయన చేతిలో ఫోన్ కూడా ఉందని చెప్పారు. బస్వంత్‌రావు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన భార్య హన్మబాయి, నలుగురు కూతుళ్లు బోరున విలపించడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. బుధవారం సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

బట్టలు ఉతుకుతుండగా కాటేసిన పాము



పోగుల లలిత(ఫైల్)

ఇందల్వాయి: పాముకాటులో వివాహిత మృతి చెందిన ఘటన సిర్నాపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పోగుల లలిత ఇంటివద్ద బట్టలు ఉతుకుతుండగా పాము కాటు వేసింది. స్థానికులు ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి భర్త నర్సయ్య, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

సెల్‌ఫోన్లు అందజేత

ఖలీల్‌వాడి: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ ద్వారా రికవరీ చేసిన పోలీసులు నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో తొమ్మిది మందికి అందజేశారు. సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులు తమకు ఫిర్యాదుచేయగా సీఈఐఆర్ ద్వారా రికవరీ చేసి వారికి అందజేశామని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై శ్రీకాంత్ గురువారం తెలిపారు.

జిల్లా కేంద్రంలో దొంగల హల్‌చల్



చోరీ జరిగిన ల్యాబ్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో దొంగలు హల్‌చల్ చేశారు. మంగళవారం రాత్రి నగరంలోని రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీకి పాల్పడగా, మరో పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి యత్నించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆటోనగర్‌లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. రహమత్‌నగర్‌లోని వెల్‌కమ్ గెస్ట్‌హౌస్ సమీపంలోని ఓ ఇంటి తాళాన్ని పగులగొట్టిన దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 10 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

అలాగే ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖలీల్‌వాడిలో ఉన్న గౌతమి పాథాలాజికల్ ల్యాబ్ షట్టర్‌ను దుండగులు పగలగొట్టి రూ.10వేలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్ద పోస్టాఫీస్ ప్రాంతంలో ఉన్న మెడికల్ షాపులో దుండగులు చోరీకి యత్నించినట్లు ఎస్సై యాసిన్ ఆరాఫత్ తెలిపారు. మెడికల్ షాపులే టార్గెట్‌గా ఓ ముఠా చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

కమ్మర్‌పల్లిలో..



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పలు ఇళ్లలో మంగళవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇళ్ల తాళాలను పగులగొట్టి చోరీ చేశారు. కలాల శ్రీలేఖ అనే మహిళ ఇంట్లో నుంచి అర తులం బంగారం, 18 తులాల వెండి, కొంత నగదును ఎత్తుకెళ్లారు. చింత గణేశ్ అనే వ్యక్తి ఇంట్లోనూ చోరీకి పాల్పడ్డారు. రమేశ్ అనే వ్యక్తి ఇంటి ముందు నిలిపి ఉంచిన హోండా యాక్టివాను ఎత్తుకెళ్లి మోర్తాడ్ సరిహద్దు లోని వ్యవసాయ క్షేత్రం వద్ద వదిలేశారు. పెట్రోల్ అయిపోవడంతో వాహనాన్ని ధ్వంసం చేసి వదిలేశారు. సుధాకర్ అనే వ్యక్తి ఇంటి తాళాన్ని పగులగొట్టి బీరువాలోని వస్తువులను ఎత్తుకెళ్లారు. భీమ్‌గల్ సీఐ నవీన్ కుమార్, ఎస్సై అనిల్ రెడ్డి చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మహిళలు మృతి



సిద్దవ్వను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి

భిక్కనూరు: మండలంలోని సిద్దరామేశ్వరనగర్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్వాపూర్ గ్రామానికి చెందిన గూడెం గారి సిద్దవ్వ (48) మృతి చెందింది. పెద్దమల్లారెడ్డి క్రాసింగ్ వద్ద ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నివాసముంటున్న సిదవ్వ దాబా హోటల్‌లో పని చేస్తోంది. దాబాలో పని అయిపోయిన తరువాత ఇంటికి వెళ్లేందుకు జాతీయ రహదారిని దాటుతుండగా హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న ప్రైవేట్ బస్సు ఢీకొట్టడంతో ఆమె తలకు తీవ్రగాయమైంది. అదే సమయంలో హైదరాబాద్‌నుంచి భిక్కనూరుకు వస్తున్న పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి గమనించి సిద్దవ్వను అందే దారిలో వెళ్తున్న అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించే ఏర్పాటు చేశాడు. అంబులెన్స్ కొద్ది దూరం వెళ్లగానే సిద్దవ్వ ప్రాణాలు కోల్పోయింది. మృతురాలికి కుమారుడు సాగర్, కుమార్తెలు బబిత, రవళి ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇందిరమ్మ గృహ సర్వే కోసం వస్తూ..



పిట్ల స్వప్న మృతదేహం

ఎల్లారెడ్డి: ఇందిరమ్మ గృహ సర్వే కోసం హైదరాబాద్ నుంచి వస్తున్న మండలంలోని రేపల్లెవాడకు చెందిన పిట్ల స్వప్న (25) మెదక్ జిల్లా కొల్చారం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బుధవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. హైదరాబాద్‌లో ఉంటున్న పిట్ల స్వప్న ఇందిరమ్మ గృహ సర్వే కోసం తన మరిది శ్రీనుతో కలిసి వస్తుండగా కొల్చారం శివారులో స్కూటీ డివైడర్‌కు ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలై ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందిందన్నారు. స్వప్న మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.